పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేఎల్పీ నేత

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని కేదార్నాథ్ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్ శనివారం పరిశీలించారు. పత్తికి గల మద్దతు ధర, రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పత్తిలో తేమ శాతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య మాజీ మండల అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, నాయకులు మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, హరినాయక్, సాదం అరవింద్ పాల్గొన్నారు.



నవతెలంగాణ

నమ్మగ తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

ఆదివారం | నవంబర్ 10, 2024 | www.navatelangana.com

సీఆర్‌టీలను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అజ్మీర శరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్‌టీల సమస్యలపై చర్చించి క్రమబద్ధీరణ కోసం విన్నవించారు. మినిమం టైంస్కేల్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తూ అర్హులైన సీఆర్‌టీల సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి, ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా నెల మొదటి తారీఖున జీతాలు అందజేయాలని కోరారు. కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు సిఆర్‌టిల గౌరవ అధ్యక్షులు మర్సకోల తిరుపతి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు జాదవ్ వినంత్‌రావ్, పవర్ సోమేశ్వర్, ధరంసోత్ వంశీ, శంకర్ ఉన్నారు.



అంగన్వాడీ టీచర్స్‌పై అధికారుల బెదిరింపులు ఆపాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అంగన్వాడీ టీచర్స్‌పై అధికారుల బెదిరింపులు ఆపాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనబోమని తెలియజేస్తూ శనివారం అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలోనే సమగ్ర కుటుంబ సర్వే చేయమని గత కమిషనర్‌తో పాటు సిడిపిఓకు వినతి పత్రాలు అందజేశామన్నారు అయినప్పటికీ ఎంపీడీవోలు పంచాయతీ అధికారులు సర్వేలో పాల్గొనాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇకనైనా అంగన్వాడీలపై అధికారుల వేధింపులు ఆపకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోశెట్టి, భాగ్య, హేమలత పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు ఖండన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేరే వాళ్ల చావులు కోరడం తన విజ్ఞతకే వదిలేస్తున్నామని, సీఎం తన స్థాయిని మరిచి హింసను ప్రేరేపించేలా, ప్రజలను రెచ్చగొట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. కెసిఆర్, కేటీఆర్, హరీష్‌రావుపై సీఎం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతో తీవ్ర అసంతృప్తికి గురవుతూ సీఎం తన స్థాయిని మరిచి దిగజారుడు వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రజలను హింసను ప్రేరేపించేలా కెసిఆర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని సాధించి దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దిన కెసిఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హింసను ప్రోత్సహించేలా మాట్లాడటాన్ని ఖండిస్తూ ఎస్పీ ఆలం గౌస్‌కు సీఎంపై కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, అలాల్ అజయ్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్, దాసరి రమేష్, కొండ గణేష్, పవన్ నాయక్, దమ్మాపాల్, బట్టు సతీష్, సలీమ్ పాల్గొన్నారు.

కార్మిక శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కార్మికశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అంజి గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి నెలనెలా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ పేర్కొన్నారు. వివిధ రోగాలకు రక్త పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. సేకరించిన రక్తపు శాంపిల్స్‌ను రిమ్స్‌కు పంపిస్తామన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య కోసం జిల్లా కేంద్రానికి రెఫర్ చేసి చికిత్స అందిస్తామన్నారు. శిబిరంలో రాజేశ్వర్ పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా పశుగ్రాసం అందజేత



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

తన మనువరాలు హని 8వ పుట్టిన రోజు సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి బంగల్‌పేట్‌లోని శ్రీ గాయత్రి గోశాలలోని గోవులకు పశుగ్రాసం అందించారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్స్ జోన్ చైర్మన్ లక్కడి రాజేశ్వర్‌రెడ్డి, గోశాల సమితి అధ్యక్షులు ప్రవీణ్ పంతులు, గోశాల సూపర్వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు టీఎన్ వెంకటరమణ

- పుస్తకావిష్కరణ సభలో తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదర్శ కమ్యూనిస్టు టీఎన్ వెంకటరమణ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని రాయల్ గార్డెన్స్‌లో 'ఆచరణవాది టిఎన్ వెంకటరమణ' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఎంతోమంది తాము కమ్యూనిస్టులమని చెపుకుంటున్నా, వారికి సిద్ధాంతంపై పూర్తిగా పట్టుండదని అన్నారు. కాని వెంకటరమణ మాత్రం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేశాడని, దాన్ని పది మందికి చెబుతూ ఎంతో మంది కమ్యూనిస్టులను తయారు చేశాడని కొనియాడారు. మనిషి పుట్టుక, మరణం అనేది సహజమని, ఈ రెండింటి మధ్య మనం ఎలా బతకామన్నదే ప్రధానమనే నానుడిని నిజం చేస్తూ వెంకటరమణ తన జీవితం ఆసాంతం కమ్యూనిస్టుగా బతికి సమాజంలో ఇంకా బతికే ఉన్నాడని అన్నారు. ఆయన ఆదర్శాన్ని పుణికిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం



వెంకటరమణ చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న తమ్మినేని, ఇతర నాయకులు

సీఐటీయూ రాష్ట్ర కేంద్రంలో కలిసి పనిచేశాం : పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రమణ, తాను ఒకేసారి సీఐటీయూ రాష్ట్ర కేంద్రంలో పని చేశామని, ఆయన వామపక్ష సిద్ధాంతంతోనే చివరి వరకు జీవించాడని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. రమణ నిత్య అధ్యయనశీలి, పరిశోధకుడు అని అన్నారు. ఆయన జీవితంతో ఎన్ని ఆటుపోట్లు ఉన్నా ఏనాడూ అవి బహిర్గతం చేయలేదని అన్నారు.

ఉద్యమానికే కాదు మా కుటుంబానికి కూడా లోటే : కమలకుమారి, యుటిఎఫ్ మాజీ నాయకురాలు

వెంకటరమణ మృతి ఉద్యమానికే కాదు, మా కుటుంబానికి కూడా లోటేనని యూటిఎఫ్ మాజీ నాయకురాలు కమలకుమారి అన్నారు. రమణకు మా కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉండేవని, ఉద్యమాల రూపకల్పనలో పడి తన ఆరోగ్యాన్ని కూడా నిర్లక్ష్యం చేసి చిన్నవయస్సులోనే ఆయన మృతి చెందడం ఇంకా బాధగానే అనిపిస్తోందంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు.

పార్టీ బలోపేతం గురించే నిత్యం ఆలోచించేవాడు : జి రాములు, సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు

టిఎన్ వెంకటరమణ నిరంతరం పార్టీని ఎలా బలోపేతం చేయాలనే విషయాలపైనే చర్చింస్తుండేవాడని జి.రాములు అన్నారు. వరంగల్‌లో పాలిటెక్నిక్ చదివే సమయంలో ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో చేరి పార్టీ శ్రేణులకు దిక్సూచిగా పని చేశాడని అన్నారు. అతన్ని నా కుటుంబసభ్యుడిగా భావించానని, ఇప్పుడు ఆయన లేకపోవడం బాధాకరమని అన్నారు.

విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలం : కలవేన శంకర్, సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి

విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలాన్ని ఒంటపట్టించుకున్న వ్యక్తి టిఎన్ వెంకటరమణ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కలవేన శంకర్ అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని సూచించారు.

కార్యకర్తలను తయారుచేసుకోవడమే ఆయనకు మనమిచ్చే నివాళులు : బండారు రవికుమార్

కార్యకర్తలను తయారుచేసుకుంటూ పార్టీని బలోపేతం చేయడమే రమణకు మనమిచ్చే నివాళులు అని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ అన్నారు. ఎంతోమంది సామాన్యులను పార్టీలో చేర్పించి వారిని ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన ఘనత రమణకే దక్కుతుందని అన్నారు. కార్యకర్తలను ఎలా చేరదీయాలి, వారితో ఎలా చర్చించాలి, వారికి తెలియని విషయాలను తెలియచేసి వారు పార్టీలో కీలకంగా ఎదిగేలా కృషి చేశారని కొనియాడారు.

రమణ స్ఫూర్తే నన్ను రైల్వే యునియన్ నాయకున్ని చేసింది : కె.శివకుమార్

కాగజ్‌నగర్‌లో తాను, రమణ క్లాస్‌మేట్‌లమని, ఆయనలో చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలు ఉన్నాయని రైల్వే యూనియన్ మాజీ నాయకులు కె.శివకుమార్ అన్నారు. చదువుకునే సమయంలో క్రికెట్ టీంకు కెప్టెన్‌గా వ్యవహరించిన రమణ, వామపక్ష ఉద్యమంలో కూడా కెప్టెన్‌గా వ్యవహరించి ఎందరో ఉద్యమ నేతలను తయారుచేశాడని అన్నారు. తాను కూడా ఆయన స్ఫూర్తితోనే రైల్వే యూనియన్‌లో నాయకత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించానని అన్నారు.

సమగ్ర సర్వే షురూ..!

- కుటుంబ వివరాల నమోదు చేసిన ఎన్యుమరేటర్లు
- ఒక్కో ఇంటి వద్ద సుమారు అరగంట సమయం
- వివరాలు అందించేందుకు ఆసక్తి కనబర్చిన జనం
- క్షేత్రస్థాయిలో పర్యటించిన ఉన్నతాధికారులు

పల్లె, పట్టణాల్లో ఇంటింటి సర్వే సందడి ప్రారంభమైంది. తొలుత మూడు రోజుల పాటు ఇంటింటికి స్టిక్కర్లు అతికించిన అధికారులు, సిబ్బంది శనివారం నుంచి సమగ్ర సర్వే ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించారు. ప్రభుత్వం అందించిన నిర్దేశిత ప్రొఫార్మాలో 56అంశాలకు గాను 75ప్రశ్నలకు వివరాలు పూరించారు. సర్వే సిబ్బంది గ్రామంలోకి వచ్చినట్లు తెలుసుకున్న జనం వారి వద్దకు వివిధ కార్డులు తీసుకొని పరుగులు తీశారు. ఈ రోజే ప్రారంభించామని.. మీ వంతు వచ్చే వరకు ఓపికపట్టాలని ఎన్యూమరేటర్లు సూచించడంతో ఇంటిదారి పట్టారు. కాగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన సమగ్ర సర్వేను తొలిరోజున ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. సర్వేప్రారంభంతో గ్రామాలు, పట్టణాల్లో సందడి వాతావరణం కనిపించింది.



జందాపూర్‌లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలదేవి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పూర్తి స్థితిగతులు తెలుసుకునేందుకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో కులాల వారీగా లెక్కలు స్పష్టంగా తెలియడంతో పాటు ప్రజలకు సంబంధించి సమస్త స్వరూపం వెల్లడయ్యేందుకు ఆస్కారం లభిస్తుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని భావించింది. ఈ సర్వే కోసం ఎంపిక చేసిన ఎన్యూమరేటర్లకు శిక్షణ పూర్తిచేసిన అధికార యంత్రాంగం మూడు రోజుల పాటు ఇంటింటికి స్టిక్కర్లు అతికించే ప్రక్రియ చేపట్టారు. తాజాగా ఆయా స్టిక్కర్ల ఆధారంగా సమగ్ర సర్వేను మొదలుపెట్టారు. ఇప్పటికే ఆయా జిల్లాల వారీగా ఇండ్ల జాబితాను గుర్తించిన అధికారులు వాటికి అనుగుణంగా సర్వే చేపట్టేందుకు ఎన్యూమరేటర్లను నియమించారు. ఉపాధ్యాయులు,అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులను నియమించింది. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 175 ఇండ్ల వరకు కేటాయించారు. దీంతో ఒక్కో గ్రామానికి ఇద్దరి నుంచి ముగ్గురి వరకు ఆయా జనాభాను బట్టి నియమించారు. తాజాగా ఎన్యూమరేటర్లు సర్వే ప్రారంభించగా.. ఒక్కో ఇంటి వద్ద ప్రొఫార్మా ప్రకారం వివరాలు నమోదు చేసేందుకు సుమారు అరగంట పాటు సమయం పడుతున్నట్లు చెబుతున్నారు. ఒక రోజులో 10 నుంచి 15వరకు మాత్రమే ఇండ్లను సర్వే చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో గ్రామంలో వారం నుంచి పది రోజుల పాటు సర్వే చేపట్టేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

75ప్రశ్నలకు వివరాలు సేకరణ

ప్రభుత్వం ఈ సర్వేను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పాటు ప్రజల నుంచి సమగ్ర సమాచారం సేకరించాలని భావించింది. ఆదిలాబాద్ జిల్లాలో 168646 ఇండ్లను గుర్తించగా..వీటిని 1810 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించారు. వీటిని సర్వే చేసేందుకు 1906 మంది ఎన్యూమరేటర్లు, పర్యవేక్షణకు 158మంది సూపర్‌వైజర్లను నియమించారు. నిర్మల్ జిల్లాలో 2,27,612 ఇండ్లకు గాను 1647 ఎన్యూమరేషన్ బ్లాకులు, 1593 ఎన్యూమరేటర్లు, 165మంది సూపర్‌వైజర్లను నియమించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1,55,091 ఇండ్లను గుర్తించగా.. 1624 బ్లాకులు, 1223 మంది ఎన్యూమరేటర్లు, 153 మంది సూపర్‌వైజర్లను నియమించారు. మంచిర్యాల జిల్లాలో 2,54,188 కుటుంబాలు ఉండగా 1900 మంది ఎన్యూమరేటర్లు, 150మంది సూపర్‌వైజర్లను నియమించారు. 75ప్రశ్నలకు సమాధానాలు అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా ఈ సర్వేలో కొందరు ఫోటోతో కూడిన ఆహారభద్రత కార్డులు తీసుకురావడంతో రేషన్‌కార్డు పూర్తి సంఖ్య అందులో ఉండటం లేదు. కేవలం చివరి ఐదు అంకెలు మాత్రమే ఉంటున్నాయి. దీంతో సర్వే సిబ్బంది నెలవారీగా బియ్యం తీసుకునే కార్డు తీసుకురావాలని సూచిస్తున్నారు. ఇందులో రేషన్‌కార్డు సంఖ్య పూర్తిగా ఉండటంతో వివరాలు నమోదు సులువుగా ఉంటుందని చెబుతున్నారు. మిగితా సిబ్బంది అడిగిన అన్ని వివరాలు అందించేందుకు జనం ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా జిల్లాలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సర్వేను తీరుతెన్నులను పరిశీలించారు. ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా చేపట్టాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. మున్సిపాలిటీల్లో మైకల ద్వారా ప్రచారం నిర్వహించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

మంచిర్యాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభల్లో తీర్మానం
- ముగిసిన మహాసభలు



మంచిర్యాల: మంచిర్యాల పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నందున పాలకులు ఆ వైపు దృష్టి సారించాలని సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలో తీర్మానం చేశారు. ఆ పార్టీ జిల్లా మహాసభలు శుక్ర, శనివారాల్లో మందమర్రి పట్టణంలో జరిగాయి. శనివారం మహాసభ పలు తీర్మానాలు ఆమోదించింది. వాటిని పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి మీడియాకు వివరించారు. జిల్లాలోని 6 మండలాల్లో సింగరేణి విస్తరించి ఉందని, మిగతా మండలాల్లో వ్యవసాయమే ఆధారంగా ప్రజలు జీవిస్తున్నారన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు, అటవీ సంపద, ప్రాణహిత, కాళేశ్వరం నదులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నా జిల్లాకు చుక్క నీరు అందడం లేదన్నారు. గత, ప్రస్తుత పాలకులు తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేయకపోవడంతో జిల్లాకు సాగు, తాగు నీరు అందకుండా పోయిందన్నారు. మరో పక్క ఓపెన్‌కాస్టులు, వ్యవసాయ రంగంలో వాడుతున్న మందులతో వ్యర్థాలు ఏర్పడి పర్యావరణ దెబ్బతింటుందోన్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యం అందక ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. కొంత మంది రాజకీయ నాయకుల స్వార్థానికి యువత గంజాయి, మద్యానికి అలవాటుపడి తమ భవిష్యత్తును కోల్పోతున్నారని పేర్కొన్నారు. మహిళలపై హింస, వరకట్న వేధింపులు, హత్యలు, ప్రేమ పేరుతో మోసాలు పెరిగాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కుల వివక్ష పేరుతో అనాగరిక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నేటికీ జిల్లాలో పక్కా ఇండ్లు, తాగు నీరు, రావాణ సౌకర్యం లేని ప్రాంతాలు ఉన్నాయన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు లేక సాగుదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. చేతి వృత్తిదారులు వెనుకబడి ఉన్నారని, వీరికి ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రోత్సాహం అందడం లేదని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో మహిళలకు ఫ్రీ బస్సు మాత్రమే అమలు చేశారని పేర్కొన్నారు. మిగతా హామీలు అమలు కాక ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల జీవోలను అమలు చేయకపోవడంతో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కుటుంబాలను పోషించుకోలేక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రావణపల్లి ఓసిని సింగరేణికి అప్పజెప్పాలని, మందమర్రిలో తోళ్ల పరిశ్రమను ప్రారంభించాలని, జిల్లాలో నెలకొన్న పోడు భూముల సమస్యలు తీర్చాలని, ఆదివాసీ గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలని, ముంపుకు గురైన రైతులకు నష్టపరిహారం అందించి, పంటలకు మద్దతు ధర అందించాలని, ఆశ్రమ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన భోజనం అందించడం వంటి సమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధికి భవిష్యత్తులో సీపీఐ(ఎం) పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. మహాసభల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, కనికరపు అశోక్, ఎర్మ పున్నం, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, దుంపల రంజిత్‌కుమార్, బోడేంకి చందు, గోమాస అశోక్, దాగం రాజారాం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో కళాకారులకు కొదవలేదు : జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో కళాకారులకు కొదవలేదని, ఆదిలాబాద్ అందాలు సినీ పరిశ్రమతో పాటు టూరిస్టులను సైతం ఆకట్టుకుంటుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. యువత సినిమా రంగంలో తమ కలను నిరూపించుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో నూతన సినిమా ప్రారంభోత్సవానికి హాజరై క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఏబి క్రియేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ గాజుగౌడ్ దర్శకత్వంలో నూతన చిత్రం రూపొందించారు. క్లాప్ కొట్టి జోగు రామన్న మాట్లాడుతూ యువత కళా నైపుణ్యానికి పదును పెడుతూ చిత్ర పరిశ్రమల్లో కూడా రాణించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.4వేల కోట్లతో ఆదిలాబాద్‌ను అభివద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. చిన్నపాటి సినిమాలకు సైతం ఆదిలాబాద్ లొకేషన్‌లో ఆతిథ్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏపీ క్రియేషన్ వారిని అభినందిస్తూ పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బట్టు సతీష్, చిన్న పటేల్, డైరెక్టర్ గజ్జు గౌడ్, భూపతి, నారాయణరెడ్డి, హీరో కళ్యాణ్, హీరో భీమేష్, హీరోయిన్ యోగితా, విలన్ సాగర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | నవంబర్ 10, 2024 | www.navatelangana.com

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్‌టౌన్, నిర్మల్‌రూరల్, సోన్, లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, నర్సాపూర్, మామడ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను శనివారం బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 289 లబ్ధిదారులకు రూ.2కోట్ల 89 లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, జిల్లా మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన ఎంఈఓకు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి నూతంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన పోశెట్టిని శనివారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మార్సీ కార్యాలయంలో శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాబోయే తరాలకు విద్య చాలా ముఖ్యమని మండలంలోని అన్ని విద్యాసంస్థలు మెరుగుపరిచే విధంగా ప్రతి పేద, మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సముచిత న్యాయం చేసే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మల్లెపూల సత్యనారాయణ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బూర్గుల మల్లేష్, నియోజకవర్గ సేవ దళ్ అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు సల్ల రవి పాల్గొన్నారు.



సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి సమగ్ర కుటుంబ సర్వేపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయాలతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమగ్ర కుటుంబ సర్వేకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు, కలెక్టర్‌లతో చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని జిల్లా కలెక్టర్లను, ఎన్యూమరేటర్లను ఉపముఖ్య మంత్రి అభినందించారు. శనివారం నుంచి ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియతో యావత్తు దేశం మొత్తం తెలంగాణను గమనిస్తున్నదని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే ప్రక్రియను నిబద్ధతతో నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుంచి ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, సర్వేకు ముందు రోజు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎలాంటి అపోహలు లేకుండా సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలాని కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి డీఆర్‌ఓ రత్నాకళ్యాణి, సీపీఓ జీవరత్నం, డీపీఓ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శంకర్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్‌సింగ్, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, ఏడీ సర్వే, లాండ్ రికార్డ్ రాథోడ్ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, రాజేష్ కుమార్, మనోహర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం ఉపముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని, అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. సర్వే కొరకు జారీ చేసిన బుక్ లెట్‌లో మొత్తం 56 అంశాలున్నాయని ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుంచి ఖచ్చితమైన సమాచారం సేకరణతో నమోదులు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వేకు ఒక రోజు ముందు గ్రామాలు, పట్టణంలో విస్తృత ప్రచారం చేయాలని, ప్రజల నుంచి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఏలాంటి సందేహాలు ఉన్న ఎంపీడీఓ, తహసీల్దార్ల దృష్టికి తేవాలని తెలిపారు. సర్వేకు నియమించిన ఎన్యూమరేటర్లకు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్‌లు ఫారంలో ఉన్న 56 అంశాల నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. సర్వే చేయు క్రమంలో మండల టీమ్ లీడర్లు సర్వే తీరును పరిశీలించి, పొరపాట్లు దొర్లకుండా నివృత్తి చేయాలని అన్నారు. ఫారం పూరించేటప్పుడు ఎలాంటి కొట్టివేతలు లేకుండా పూరించాలని స్పష్టం చేశారు. ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ సర్వే పూర్తయిన అనంతరం పూరించిన ఫారాలను భద్రపరచాలని ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజలు పొలాలకు వెళ్లకముందు ఇంట్లో ఉన్న సమయంలో ఉదయం 7 గంటలకు సర్వే ప్రారంభించాలని అన్నారు. సర్వే రిపోర్ట్ మధ్యహ్నం 1.00 గంటలకు, సాయంత్రం 5.00 గంటలకు సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కంప్యూటరైజ్డ్ చేయడానికి 395 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించడం జరిగిందనీ, తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలనీ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, సీఈఓ జితేందర్‌రెడ్డి, డీఈఓ ప్రణీత, మున్సిపల్ కమిషనర్, డీపీఓ శ్రీలత, డీఎల్పీఓ ఫణీంద్ర పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలో సత్తా చాటుతున్న ఆశ్రమ విద్యార్థులు



నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు సత్తా చాటుతున్నారు. రెండు రోజుల క్రితం కేబి కంప్లెక్స్ ఉట్నూర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలో పాఠశాలకు చెందిన జాదవ్ మౌనిక, 7వ తరగతి అండర్ -14 విభాగంలో క్యారమ్‌లో మొదటి బహుమతి పొందారు. అదేవిధంగా ఇదే పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని రాథోడ్ కాజల్ జోనల్ లెవెల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన అండర్-14 పోటీల్లో గోల్డ్ మెడల్ ప్రథమ బహుమతి పొంది రాష్ట్రస్థాయి ఖమ్మం జిల్లాలో జరిగే షార్ట్‌పుట్ పోటీల్లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో మంచి ప్రతిభ కనబరిచిన మౌనిక, కాజల్‌తో పాటు పీడీ ఆడే విశ్వనాథ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ విఠల్ శాలువాతో సన్మానించి అభినందించారు. సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పవార్ వనిత, ఆర్.రాజేశ్వర్, వసంత్‌రావ్, పీఎస్ హెచ్‌ఎం శంకర్, బి.సూరజ్‌సింగ్, ఆర్ ప్రకాష్, ఆర్.పండిత్ సింగ్, రాజశేఖర్, ఎస్ రాజ్యలక్ష్మి గంగా, విజయ, శ్రీకాంత్ ఉన్నారు.

పత్తికి తేమశాతం పెంచి మద్దతు ధర కల్పించాలి



నవతెలంగాణ-బోథ్

రైతులు పండించిన పత్తికి తేమశాతం పెంచి మద్దతు ధర కల్పించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయని అన్నారు. పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించకుండా తేమ శాతంతో వారిని మోసం చేస్తున్నారన్నారు. అందుకే సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు నిరాకరించడం జరిగిందన్నారు. రైతులు తేమ శాతంతో తాము మోసపోతున్నామని తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, మల్లెపూల సుభాష్, తిరుమల్ గౌడ్ పాల్గొన్నారు.

మద్దతు ధర విషయంలో నష్టపోతున్న రైతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి మద్దతు ధర విషయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితులు నెలకొన్నాయని అఖిలపక్ష రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి అన్నారు. శనివారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి మద్దతు ధర పెంపు, తేమ నిబంధనల సడలింపు, రైతు భరోసా సాయం వంటి డిమాండ్ల సాధన కోసం అఖిల పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. రైతులను సమీకరించడంలో భాగంగా గత రోజులుగా మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ, సమస్యలపై తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించామని తెలిపారు. తమకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీసేందుకు రైతులు ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు రమేష్, లోకారి పోశెట్టి, గోవర్ధన్ యాదవ్, విజ్జగిరి నారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మ దహనం

- అడ్డుకున్న పోలీసులు



నవతెలంగాణ-తలమడుగు

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వర్గీయులు చింపివేయడాన్ని నిరసిస్తూ శనివారం సుంకిడి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, సల్ల దేవన్న, రఫీ, రామచందర్, లస్మన్న, వెంకట్ యాదవ్, నర్సయ్య ప్రతాప్ పాల్గొన్నారు.

ఇచ్చోడ : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా బోథ్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వర్గీయులు చింపివేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది.

తాంసి : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బోథ్ ఎక్స్‌రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సిని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వర్గీయులు చింపివేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు శనివారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాలలో కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ ఎస్సైతో పాటు తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో తాంసి, భీంపూర్ మండలాల నాయకులు అశోక్, శ్రీధర్‌రెడ్డి, నారాయణ, సంతోష్, రామన్న యాదవ్, నరేష్, గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, మల్లేష్, నాందేవ్, కిషన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్ : మండలకేంద్రంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను శనివారం పట్టణంలో ఊరేగించి, అనంతరం బస్టాండ్ ఎదుట దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని చింపిన ఘటనకు నిరసనగా, ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందన్నారు. సీఎం ఫ్లెక్సీ చింపడం రౌడీయిజమన్నారు. గతంలో ఫ్లెక్సీ రాజకీయాలు లేవని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అహంకారంతో తన ఫ్లెక్సీలే తప్ప ఇతర ఫ్లెక్సీలు ఉండకూడదన్న ఉద్యేశంతో ఫ్లెక్సీలు చింపడం జరుగుతుందన్నారు. సీఎం చేస్తున్న అభివృద్ధిని చూడలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మెన్ ఆడే వసంత్, ప్రఫుల్ రెడ్డి, నాయకులు కుమ్ర కోటేష్, పోతన్న, అబుద్, లోలపు పోశెట్టి, మహిమూద్, మహేందర్ పాల్గొన్నారు.

రిమ్స్‌ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ ఆస్పత్రిని ఎమ్మెల్యే పాయల శంకర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న రోగులకు అందుతున్న వైద్యం తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పలువురు డాక్టర్లతో కలిసి రిమ్స్ జనరల్ వార్డు, చిల్డ్రన్స్ వార్డు, తదితర వార్డులను తిరుగుతూ రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రిమ్స్‌కు ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని అన్నారు.

తాళం పగుల గొట్టి దొంగతనం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని సొనారి గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టి దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సొనారి గ్రామానికి చెందిన సూర్యవంశీ దేవానంద్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఇంటికి తాళం వేసి బంధువుల గ్రామమైన బెల్గాం గ్రామంలో నూతన గృహప్రవేశానికి వెళ్లారు. శనివారం ఉదయం దేవానంద్ ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించి, ఫోన్ ద్వారా ఇంటి పక్కవారు సమాచారం అందించారు. దేవానంద్ వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న ఐదు గ్రాముల బంగారం రూ.45వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దొంగతనం జరిగిన ఇంటిని కుభీర్ ఎస్సై పరిశీలించి, దేవానంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

నవతెలంగాణ-సారంగాపూర్

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపుకు వెళ్తున్న ఆర్టీసీ బస్ రాణాపూర్ శివారులో ఆవుల మందకు గుద్ది ఒక ఆవును గాయపరిచింది. రాణాపూర్ గ్రామస్థులు ఆర్టీసీ డ్రైవర్‌ను కొట్టారు. శనివారం ఈ విషయంలో కేసు నమోదు చేసి డ్రైవర్‌ని కొట్టిన ఇద్దరు వ్యక్తులు ఆడే శ్రీనివాస్, ఆడే మోహన్ నాయక్‌లను అరెస్ట్ చేసి కోర్ట్‌లో హాజరుపరిచినట్టు ఎస్సై వెల్లడించారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-సిరికొండ

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి అవంతరాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. సర్వే అయిన ప్రతి ఇంటి పైన స్టిక్కర్ అంటించాలని అన్నారు. పత్రంలో ఉన్న ప్రశ్నలను సరిగా నింపుతున్నారా లేదా అని ఫారమ్‌ను తీసుకొని పరిశీలించారు. ప్రతి ఇంటిలోని వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ఓపికతో ప్రతి కుటుంబం నుంచి స్పష్టత కలిగిన సమాధానాలను సేకరించాలని, సర్వే జరుగుతున్న సమయంలో కుటుంబ యజమానికి, వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచుతామని వారికి అర్థం అయ్యే విధంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డీఎల్పీఓ ఫణిందర్‌రావు, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ సంతోష్, ఏపీఎం సంతోష్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే కార్యక్రమాన్ని ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని సర్వే అధికారులకు మండల ప్రత్యేకాధికారి డీసీఓ మోహన్ సింగ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్లను సమర్ధవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఎటువంటి సందేహాలు ఉన్న సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు. కుటుంబ పెద్ద అధికారి అడిగిన ప్రతి పత్రం చూపించి వివరాలను తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సర్వేలో వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ మేకల వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఇంద్రవెల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ కే.భాస్కర్ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని పిప్రి, శంకర్ గూడ తదితర గ్రామాల్లో సర్వేను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. కుటుంబ సర్వే చేసేటప్పుడు ప్రోఫార్మాలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కుటుంబంలో అందరి సభ్యుల ఆధార్, రేషన్ కార్డు, తదితర వివరాలను సేకరించాలని సూచించారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి ఎలాంటి తప్పిదాలు లేకుండా సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. అటు మండల కేంద్రంలోని పలు వార్డుల్లో తహసీల్దార్ ఎం.ప్రవీణ్ కుమార్ కుటుంబ సర్వేను పరిశీలించారు. నిర్ణీత సమయంలో సర్వేను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శి ఏర్రవార్ ప్రమీల పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పిల్లలకు వాక్సినేషన్ వేయించాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రతి బాలింతలు తమ పిల్లలకు విధిగా వాక్సినేషన్ వేయించుకోవాలని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. శనివారం ఇంద్రవెల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంజి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చంటి పిల్లలకు వివిధ రకాల వాక్సినేషన్‌ను వేశారు. వైద్య సిబ్బంది ఇచ్చిన కార్డు ప్రకారం ప్రతి నెల శనివారం వాక్సినేషన్ వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుశీల, అరుణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

నవతెలంగాణ-కుభీర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు ఎంఈఓ విజయ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని పార్డి(బి), సిరిపెల్లి తండా-2 పాఠశాలల ను పరిశీలించారు. పాఠశాల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు మధ్యహ్న భోజనం నాణ్యతతో కూడిన భోజనం అందించేలా చూడాలని నిర్వహకులకు సూచించారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని గోయగాం గ్రామ పంచాయతీలోని రాజుల్‌గూడ గ్రామంలోని పాఠశాలలో శనివారం టీకాల కార్యక్రమాన్ని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలు, గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు దమ్ము, దగ్గు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక చలిలో బయటికి రాకుండా ఉండడం మంచిదని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునంద, హెచ్‌ఏ భగవాన్‌దాస్, ఆశా పార్వతి పాల్గొన్నారు.

మాతృశ్రీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మాతృశ్రీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు గుండి రోడ్డులో గల వాసవిగార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ దశ ఎంతో గొప్పదని సరైన జీవిత లక్ష్యం ఎంచుకునే సమయమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం లింగమూర్తి, పవన్, ప్రసాద్, శైలేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి చేసిన బుల్డోజర్ వ్యాఖ్యలు నిరసిస్తూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. మూసి ప్రక్షాళన పేరుతో కోట్లు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని దీనిని ఆపే ప్రయత్నం చేయడానికి సిద్ధమవుతున్న ప్రతిపక్షాలను అడ్డుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి మూసి పర్యటనలో అడ్డుకుంటే బుల్డోజర్లతో తొక్కిస్తామని వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలను తెలియజేసే స్వేచ్ఛ ఉంటుందని తెలిసి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ తెలంగాణ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. అటువంటి వ్యక్తిని కించపరచడం సరైన విధానం కాదని, వెంటనే తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు హైమద్, నిస్సార్, శ్రీనివాస్, భీమేష్, నారాయణ, బలరామ్ పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని మొట్లగూడ గ్రామానికి చెందిన ఎనగందుల పోశయ్య(80) కొన్ని రోజులుగా కనిపించకుండా పోవడంతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సైరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పోషయ్య గత నెల 10న మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుండి వెళ్ళిపోయాడన్నారు. దీంతో కుటుంబీకులు బంధువులు, చుట్టూ పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోషయ్య కొడుకు ఎనగందుల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలలకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ కార్యాలయ కౌన్సిలర్ చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాలల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాల, బాబాపూర్‌లోని ఎంజేపీలో బాలల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని వాటి నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేశారు. వీరికి ఈనెల 14న బహుమతుల ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీపీఓ, చైల్డ్ లైన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల రిలే దీక్షలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసరా పెన్షన్ల విషయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చనందుకు నిరసిస్తూ ఈ నెల 11 నుండి 16 వరకు కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే వికలాంగుల రిలే నిరాహార దీక్షలు విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ అన్నారు. మండలంలోని అంకుశపూర్‌లో వికలాంగ హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నవంబర్‌లో తాము అధికారంలోకి వస్తే ఆసరా పెన్షన్లు వికలాంగులకు రూ.6000, వృద్ధులకు రూ.4000 ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. సంవత్సరం గడిచినప్పటికీ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 11 నుండి 16 వరకు కలెక్టరేట్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వృద్ధులు వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వికలాంగుల పోరాట సమితి ఆసిఫాబాద్ డివిజన్ కన్వీనర్‌గా కళ్యాణ్, కో కన్వీనర్‌గా మహేందర్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బన్నమూర్తి, కేశవ యాదవ్, కిషన్, యశోద, సుశీల, కళావతి, తార పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో ధర్మపురి పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత్ కల్చరల్ అకాడమీ తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజి రాష్ట్ర స్థాయి కవితల పోటీలను శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. ఇందులో నవజ్యోతి సాహితీ సంస్కృతిక సంస్థ అధ్యక్షులు ఆకసం పద్యకవి ప్రముఖ కవిరచయిత ధర్మపురి వెంకటేశ్వర్లు రచించిన వసుధాశతక పుస్తకాన్ని ప్రముఖ సినీ పాటల రచయిత మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ సినీ రచయిత దర్శకులు నాగబాల సురేష్ కుమార్ రచయిత అక్కినేని శ్రీధర్, వేనిగాళ్ల రాంబాబు, సాధనాల వెంకటస్వామి నాయుడు, తెలుగు టీవీ రచయితల సంఘం అధ్యక్షులు ప్రేమ్ రాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో ధర్మపురి వెంకటేశ్వర్లు, చిలుకూరి రాధాకృష్ణ చారి కవిత పఠనం చేశారు. వారిని ప్రముఖ కవులు ప్రశంసించి సత్కరించారు.

అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ : ఓటరు లిస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లాలో అర్హత గల 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఓటర్ నమోదు సవరణల కోసం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్రత్యేక ప్రచార దినాల్లో భాగంగా బీఎల్ఓల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి 18 సంవత్సరాలు నిండిన వ్యక్తిని ఓటరుగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనికోసం శని ఆదివారాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన ఓటర్ల నమోదు కోసం ఫామ్-6, అభ్యంతరాలకు ఫామ్-7, సవరణలకు ఫామ్-8 ద్వారా చేయడం జరుగుతుందని, 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎస్ఆర్ 2024పై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి జిల్లాతో పాటు మంచిర్యాలలో శుక్రవారం పర్యటించారని ప్రతి అధికారి బాధ్యతగా తీసుకోవాలన్నారు.

సిర్పూర్(టి) : రాజ్యాంగం కల్పించిన ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నవంబర్ 9, 10వ తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ అన్ని పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటర్లుగా నమోదుకు ముందస్తు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అక్రమ దందాలు చేస్తే చర్యలు తప్పవు



నవతెలంగాణ-కౌటాల

మండలంలో అక్రమ దందాలు చేస్తే చర్యలు తప్పవని సీఐ ముత్యం రమేష్ హెచ్చరించారు. మహారాష్ట్ర నుండి అక్రమంగా తరలిస్తున్న శనివారం తెల్లవారుజామున ఎస్సై ఎన్ మధుకర్ పట్టుకొగా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చింతలమానపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన పర్వతాల ప్రవీణ్ అదే గ్రామానికి చెందిన అగాడి కొండయ్య, కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన ఓడీలా ప్రకాష్లు, మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా నుండి ప్రాణహిత నదిలో నాటు పడవ ద్వారా దేశీదారు తీసుకువస్తున్నారు. మళ్ళీ గూడెం నుండి గడ్చిరోలి జిల్లాకు తరలించేందుకు దేశదారు 20 కాటన్‌ను తీసుకువస్తున్నారు. సమాచారం మేరకు ఎస్సై మధుకర్ దాడి చేసి దేశదారు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.8 లక్షల విలువచేసే 20 కాటన్ల దేశిదారుతో పాటు ఆటోను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ ఎలాంటి అక్రమ దందాలు జరిగిన తమకు సమాచారం అందించాలన్నారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇలాంటి దందాలు చేసిన వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. నిషేధిత గుట్కా పొగాకు గంజాయి తరలించిన, వ్యాపారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ మహమూద్, రాకేష్ ఉన్నారు.

రక్షణలో ప్రథమ స్థానంలో నిలపాలి

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా ఉద్యోగులు రక్షణతో కూడిన విధులు నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు, అవగాహన కల్పించాలని జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. శనివారం తన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో ఉద్యోగుల రక్షణకు సింగరేణి పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ప్రతి ఉద్యోగికి సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగులు ఇంటినుంచే రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. కళాకారులు పాటలు, నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యతను వివరిచాలని పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాకు మొదటి బహుమతి వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఖైరిగూడ పీఓ ఎం.నరేందర్, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమం

నవతెలంగాణ-రెబ్బెన

అమరుల స్ఫూర్తితో మోడీ ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఎండీ. చాంద్ పాషా అన్నారు. మండలం గోలేటి టౌన్‌లోని సివిక్ కార్యాలయ ఆవరణలో పార్టీ ఆధ్వర్యంలో భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల వర్ధంతి సభను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, భూమి, భుక్తి కోసం పేద ప్రజల పక్షాన నిలబడి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడి అనేక మంది అమరులయ్యారన్నారు. దేశంలో మతన్మాదం విష కోరలై ప్రజల మీద, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్ల కోసం, సీట్ల కోసం, కుల మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయు జిల్లా నాయకులు బండారి తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఐఎఫ్టీయూ ఏరియా అధ్యక్షులు అరికిళ్ల పోశం, కార్మికులు చందు, శంకర్, సోమయ్య, వెంకటేష్, స్వామి, పి.లక్ష్మి, కవిత, శంకరమ్మ, తార, నాగలక్ష్మి, ఇంద్ర, పద్మ కమల పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



ఎల్లూరు ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాజేష్ ఈ నెల ఐదు నుండి జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాల్లో అండర్-14 లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించిచాడు. దీంతో ఆదివాసీ సంఘాల నాయకులు ఆలం సకారాం, మాజీ సర్పంచ్ భుజంగరావు, వీటీడీఏ చైర్మన్ అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ విద్యార్థిని శాలువాలతో సన్మానించారు. మారుమూల ప్రాంతం నుండి రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనేలా విద్యార్థులకు తొడ్పాటునందించిన పీడీ తిరుపతిని అభినందించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు హనుమంతు, మాజీ సర్పంచ్ మధునయ్య, బాపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షల క్యాంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మిక శాఖ, సీఎస్ఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో నేడు పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా(తారిక్) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న కార్మికులకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీపీ, షుగర్‌లతో పాటు 32 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి వారం రోజుల్లోగా రిపోర్టులను అందజేస్తారన్నారు. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న కార్మికులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్టస్థాయి కవి సమ్మేళనంలో జిల్లా కవి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో జిల్లా కవి రాధాకృష్ణ చారి పాల్గొని తన కవిత గానం చేశారు. భారత్ కల్చరల్ అకాడమీ తెలుగు టెలివిజన్ రచయితల సంఘం సంయుక్తంగా ప్రజాకవి కాళోజి స్మారక జాతీయస్థాయి కవితల పోటీల కవిసమ్మేళనం శనివారం నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొన్నారు. రాధాకృష్ణ చారిని ప్రముఖులు టీవీ నటులు, రచయిత నాగబాల సురేశ్ కుమార్, సినీ పాటల రచయిత మౌనశ్రీ మల్లిక్, సినీ దర్శక నిర్మాత ప్రభాకర్ జైని, తెలుగు టీవి రచయితల సంఘం అధ్యక్షులు ప్రేమ్ రాజ్ సన్మానించారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా చేయాలి : కలెక్టర్



ఆసిఫాబాద్ : సర్వేపై అధికారులకు వీసీలో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం నుండి ప్రారంభమైన ప్రశ్నావళి సేకరణ పకడ్బందీగా చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం నుండి వివిధ శాఖల జిల్లా అధికారులు నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభమయ్యే ప్రశ్నావళి సేకరణలో నోడల్ అధికారులు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. సూపర్‌వైజర్లపై, ఎన్యుమరేటర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. రోజువారీగా పూర్తిచేసే వివరాలను సాయంత్రం 6 గంటలలోపు అందజేయాలన్నారు. ఎక్కడైనా తప్పు జరిగితే వెంటనే దానిని సవరించేలా పనిచేయాలని కప్పిపుచ్చేలా పనిచేయకూడదన్నారు. సర్వే జిల్లాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత నోడల్ అధికారులపై ఉంటుందన్నారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రతిరోజు సర్వే చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లు రోజువారీగా చేసిన సర్వేకు సంబంధించిన పేపర్లు ప్రతిరోజు ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వాల్సిన అవసరం లేదని అదే సందర్భంలో సూపర్‌వైజర్లు వాటిని తీసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే పట్ల ప్రజల్లో ఏమైనా అపోహలు ఉంటే వాటిని తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వరరావు, జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జిల్లాలో శనివారం ప్రారంభమైన కుటుంబాల ప్రశ్నావళి సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని వార్డు నెంబర్ 15 నిర్వహిస్తున్న సర్వే తీరును కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే లక్ష్యాన్ని నెరవేర్చే బాధ్యత ఎన్యుమరేటర్లపై ఉంటుందన్నారు. అందుబాటులో లేని వారి దగ్గరికి మరోసారి వెళ్లాలని అంతేగాని ఏ ఇంటిని కూడా వదిలిపెట్టకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

కాగజ్‌నగర్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. శనివారం ఆమె కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. కుటుంబసభ్యుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు. అనంతరం ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : సర్వే తీరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా



సిర్పూర్(టి) : సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు

పెంచికల్‌పేట్ : మండలంలోని గ్రామ పంచాయతీల్లో శనివారం ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సర్వే చేపడుతున్నారు. మండలవ్యాప్తంగా ఇన్‌చార్జీ అధికారులు సర్వే ఏ విధంగా జరుగుతందో గ్రామాల్లో తిరుగుతూ ఎన్యుమరేటర్లకు తగు సూచనలు చేస్తున్నారు.

దహెగాం : కులగణన సర్వేను సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సజీవన్ అన్నారు. శనివారం మండలంలోని బిబ్రా గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేని ఎంపీడీఓ రాజేందర్‌తో కలిసి పరిశీలించారు. సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమలత, అధికారులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలో కుల గణన సర్వేలో భాగంగా మొదటి రోజు మండల కేంద్రంతో పాటు బాలాజీ అనుకోడ, రవీంద్ర నగర్-1, రవీంద్ర నగర్-2 గ్రామాలలో నిర్వహించారు. ఎంపీడీఓ కోట ప్రసాద్ కుల గణనపై ఎన్యుమరెటర్‌లకు సూచనలు చేశారు.

సిర్పూర్(టి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కులగణన సర్వే కార్యక్రమానికి మండలంలోని ప్రజలు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు పరిశీలించారు.సర్వే చేసే క్రమంలో ఎలాంటి సందేహాలున్న సంబంధిత అధికారులకు సంప్రదించి నివృత్తం చేసుకోవాలని ఎన్యుమేటర్స్‌కు సూచించారు.



చింతలమానేపల్లి : సర్వేలో ఎన్యుమరేట్లకు సూచనలు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | నవంబర్ 10, 2024 | www.navatelangana.com

జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో 11 నుండి 14 వరకు జరిగే జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ రమా కళ్యాణి అన్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారం, అండర్ 14 అథ్లెటిక్స్ పోటీలుంటాయన్నారు. ఇందులో 15 పాఠశాలలు, కళాశాలలల నుంచి 1500 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ ఇన్‌చార్జి సట్లం శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్.మల్లిక, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జోష్ నింపిన తమ్మినేని రాక

నవతెలంగాణ-మంచిర్యాల

మందమర్రిలో కొనసాగుతున్న సీపీఐ(ఎం) 3వ మహాసభలకు ముఖ్య అతిదిగ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం హాజరవ్వడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సహం నిండింది. తమ్మినేని రాక కోసం ఎదురు చుసిన నాయకులు పార్టీ శ్రేణులు ముందుగా రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ వద్ద తమ్మినేనికి గణ స్వాగతం పలికారు. అనంతరం ఏరియా హాస్పిటల్ నుండి మందమర్రి సీఈఆర్ క్లబ్ వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహిచారు. పార్టీ శ్రేణులకు నాయకులకు పార్టీ విధి విధానాలు, పేద ప్రజల తరపున పార్టీ ఉద్యమాలు కొనసాగించాలని, ఎపుడు ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులున్నారు.



సర్వేలో అన్ని అంశాలు పొందుపరచాలి



లక్షెట్టిపేట

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో అన్ని అంశాలు పొందుపరచాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబవత్ మోతీలాల్ తెలిపారు. శనివారం పలు వార్డులలో పర్యటించి సర్వే తీరును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సర్వేలో భాగంగా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, కమిషనర్ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి.

నస్పూర్ : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీహెచ్ఎంసీకమీషనర్ ఇలంబర్తి, ప్రణాళిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వీసీలో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో పాల్గొని సర్వే వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఓ, జడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్లు, అధికారులు పాల్గొన్నారు

జన్నారం : మండలంలోని 29 గ్రామపంచాయతీలలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వే ప్రక్రియను ఎంపీడీఓ శశికళ శనివారం పరిశీలించారు. మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. కుటుంబ యజమాని చెప్పిన వివరాలు మాత్రమే పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జలంధర్, పొనకల్ ఈఓ రాహుల్, అధికారులు పాల్గొన్నారు.

మందమర్రి : సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వేను శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వార్డులలో పర్యటించి సమగ్ర సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇబ్బందిపడకుండా పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుంటే వివరాలన్నీ సులభంగా చెపొచ్చన్నారు.

జైపూర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే-2024 నిర్ణీత వ్యవధితో పూర్తి చేయాలని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కాసీం మహమ్మద్, జెడ్పీ సీఈఓ గణపతి సూచించారు.. మండల పరిధిలో కొనసాగుతున్న కుటుంబ ఇంటి సర్వే తీరును శనివారం ఇందారం, రామారావుపేట్, టేకుమట్ల, షెట్‌పల్లి, ముదిగుంట గ్రామాలను సంధర్శించి పరిశీలించారు. సర్వే ప్రొఫార్మాల్లో పొందుపర్చిన ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తప్పొప్పులు తావివ్వకుండా కుటుంబాల వారి వివరాలు పొందుపర్చాలని సూచించారు. జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి, జెడ్పీ సీఈఓతో పాటు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపురావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జిల్లా అధికారులతో గ్రామాల్లో పర్యటించారు. శివ్వారం, పౌనూర్, షెట్‌పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే తీరును సూపర్‌వైజర్ రాజకుమార్ పరిశీలించారు.

కాసిపేట : మండలంలోని దేవాపూర్, సోమగూడెం(కె), ముత్యంపల్లి, చిన్న ధర్మారం గ్రామ పంచాయతీల్లో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాది, రాజకీయ, కుల సర్వేను తహసల్దార్ భోజన్న, ఎంపీడీఓ సత్య నారాయణ సింగ్, ఎంపీఓ సఫ్టర్ అలీ పరిశీలించారు. సర్వే పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.



జైపూర్



మందమర్రి



జన్నారం

48 గంటల ధర్నాను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సమస్యల పరిష్కరానికి నవంబర్ 11,12 తేదీలలో కలెక్టరేట్ ఎదుట జరిగే 48 గంటల ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని ఐకేపీ వీఓఏలు ఉద్యోగులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ కోరారు. శనివారం ఐకేపీ వీఓఏ యూనియన్(సీఐటీయూ) ముఖ్య నాయకుల సమావేశం నస్పూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించిన స్పందించడం లేదన్నారు. అందుకే ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుంటాల కుమార్, దుర్గం రాములు, జిల్లా కోశాధికారి పొట్ట పోశం, జిల్లా కమిటీ సభ్యురాలు గోగర్ల రజిత పాల్గొన్నారు.

గెలిపిస్తే సమస్యలపై మండలిలో గళమెత్తుతా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నస్పూర్



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై మండలిలో గళమెత్తుతానని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధిస్తానని పూర్తి నమ్మకం ఉందని, ఎమ్మెల్సీ ఓటు హక్కు పై అవగాహన కల్పించి కొత్తగా1,40,000ఓట్లను నమోదు చేయించడం జరిగిందన్నారు. నమోదు చేసుకోని వారు, మార్పులకు నవంబర్ 23 నుండి డిసెంబర్ 9 వరకు అవకాశం ఉందని, అర్హత గల అభ్యర్థులు ప్రతి ఒక్కరూ విలువైన ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నిరుద్యోగుల సమస్యను పరిష్కరిస్తామని, ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌ను అమలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన 3 డీఏ ఇప్పిస్తామన్నారు. ప్రభుత్వ ప్రయివేట్ విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రపాణి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, రామకృష్ణ, ఉపేందర్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, రాజ్ కుమార్, విష్ణువర్ధన్, బషీరుద్దీన్, మమత, మానస పాల్గొన్నారు.

చింతగూడలో అమరవీరుల సంస్మరణ సభ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడలో శనివారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభను ఆ పార్టీ మండల అధ్యక్షుడు పురం శెట్టి బాపు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ న్యూ డెమోక్రసీ, జిల్లా కార్యదర్శి జాడి దేవరాజు, మండల అధ్యక్షుడు పురంశెట్టి బాపు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి, దేశ విముక్తి కోసం అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ప్రజల కోసం పోరాడి దోపిడి వ్యవస్థను తరిమి కొట్టడానికి తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి పోరాటం చేసిన అమరుల త్యాగాలు మరువలేనివి అన్నారు. వారి ఆశయ సాధన పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రమాదేవి, నాయకులు మల్లేష్, రజిత, పోసవ్వ, ఏసు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-తాండూర్



హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగిన తొమ్మిదవ జూనియర్ నేషనల్ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన సన అంజుమ్ ఎంపికయ్యారు. సుభద్ర కాలనీకి చెందిన విద్యార్థిని స్థానిక కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఈనెల 15న రాజస్థాన్‌లో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటుందని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు, అంజుమ్ జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని స్థానికులు అభినందించారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

వీధి కుక్కలు దాడి ఘటనలో ఇద్దరు గాయాల పాలయ్యారు. శనివారం పట్టణంలో ఇద్దరిపైని వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికంగా నివాసం ఉంటే ఎంబడి తిరుపతి, ఎంబడి గంగమ్మ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. ఉత్కూర్ చౌరస్తా సమీపంలో కుక్కల గుంపు ఒక్కసారిగా వీరిపై దాడి చేశాయి. దీంతో గాయపడ్డ ఎంబడి గంగమ్మను మంచిర్యాల హాస్పిటల్‌కు తరలించారు. వీధి కుక్కల వలన ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

ఉదారత చాటుకున్న మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పోన్కల్ గ్రామంలో తల్లిదండ్రులు లేని ఒక యువతి వివాహానికి మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఆర్థిక సాయాన్ని అందించి ఉదారత చాటారు. పోన్కల్ గ్రామానికి చెందినమేకల రమేష్-లక్ష్మి దంపతుల ద్వితీయ కుమార్తె శ్రీవాణి పెళ్లి ఈనెల 17న జరగాల్సి ఉంది. దీంతో శ్రీవాణి కుటుంబ సభ్యులకు మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించి తన మంచి మనస్సును చాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్‌రావు, స్నేహ అధ్యక్షులు దుమల రమేష్, యువశక్తి యూత్ అధ్యక్షులు మర్రిపల్లి శేఖర్, ప్రవీణ్, ప్రశాంత్, జాడి లచ్చన్న, రాజు దొర పాల్గొన్నారు.



అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



తాండూర్ : ఓటరు లిస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇమ్రాన్

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఆయా గ్రామాల్లో 18 సంవత్సరాలు దాటిన వారు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు.18 సంవత్సరాలు దాటిన వారు బూత్ లెవెల్ అధికారులుగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లను సంప్రదించి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాండూర్ : శని, ఆదివారాలలో నిర్వహించే ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. శనివారం అచలాపూర్ గోపాల్ నగర్ పంచాయతీలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు దాన్ని ప్రతి ఎన్నికల్లో వినియోగించుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కొత్త నమోదుకు ఫాం6, తొలగింపుకు ఫాం7, మార్పులు చేర్పులకు ఫాం8 వినియోగించాలని తెలిపారు. అనంతరం తాండూర్ గోపాల్ నగర్‌లో కొనసాగుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గైర్హాజర్ శాతం తగ్గి లక్ష్యాలను అధిగమించాలి

నవతెలంగాణ-నస్పూర్

గనిలో గైర్హాజశాతం తగ్గి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఆర్కే5, 6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ అన్నారు. శనివారం ఆర్కే5 గనిలో మెరుగైన ఉత్పత్తి సాధించిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులను గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ, గౌరవప్రదమైన ఇన్సెంటివ్ పొందాలన్నారు. కొద్ది సంవత్సరాలుగా ఉత్పత్తి, రక్షణలో సింగరేణిలో అగ్రగామిగా నిలుస్తున్న ఆర్కె 5 గని ఈ ఏడాది కూడా అదే స్పూర్తి కొనసాగించి రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యసాధనలో నెంబర్ వన్‌గా నిలవాలన్నారు. కొన్ని ప్రతికూల పరిస్థితులు, ఉద్యోగుల గైర్హాజరు కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు సంస్థ ఉత్పత్తి సాధనలో కొంత వెనుకబడిందన్నారు. ఉత్పత్తితో పాటు మెరుగైన ఓఎంఎస్ సాధిస్తే ఇన్సెంటివ్ రూపంలో అందుకు తగ్గ ప్రతిఫలం పొందవచ్చన్నారు. ప్రస్తుతం మూడు షిఫ్టుల్లో ఉత్పత్తి ఏ విధంగా జరుగుతుంది దాన్ని ఏవిధంగా మెరుగు పరుచుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం శుక్రవారం ఆర్కె 5 గని నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధీర్ కుమార్ ఝను ఉద్యోగులు, అధికారులు శాలువాలతో సత్కరించారు. కలిసికట్టుగా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించి ఆర్కె 5ను సింగరేణిలోనే టాప్‌గా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఇందులో రక్షణ అధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్, ఇంజనీర్ సారయ్య, అడిషనల్ మేనేజర్ శివయ్య, అసిస్టెంట్ మేనేజర్ వినయ్ రెడ్డి, అండర్ మేనేజర్లు వేణుగోపాల్, సునీల్, నవీన్, లింకన్, ప్రశాంత్, వర్క్మెన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, ఫిట్ సెక్రటరీ నర్సింగరావు పాల్గొన్నారు.



దళితుల మధ్య చిచ్చుకు వర్గీకరణ



నవతెలంగాణ-జన్నారం

దళితుల మధ్య చిచ్చు పెట్టట్టే ఎస్సీ వర్గీకరణకు మాలలు వ్యతిరేకమని మాల మహానాడు నాయకులు అన్నారు. అక్టోబర్ 25 నుంచి డిసెంబర్ ఒకటి వరకు మాల మానాడు ఆధ్వర్యంలో నిర్వహించే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాల మానాడు జిల్లా అధ్యక్షుడు గజల్లీ లక్ష్మణ్ అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు 38 రోజులు, 1000 కిలోమీటర్లు, 16 జిల్లాలు 35 నియోజకవర్గాల్లో చేపట్టిన మహా పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. దళితుల మధ్య చిచ్చుపెట్టే ఈ వర్గీకరణకు మాలలు వ్యతిరేకం అన్నారు. అందుకోసం నిర్వహించే ఈ పాదయాత్రలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు బీఆర్ బెజ్జమెన్, జిల్లా ఉపాధ్యక్షులు జై.నర్సింగ్, అక్కవత్తుల దేవయ్య, బండ దేవేందర్, గరిసే రామస్వామి, మేడ రాజన్న, బాలరాజు, మేకల మాణిక్యం, దాముఖ కరుణాకర్, జక్కుల సురేష్, సామల్ల లక్ష్మీరాజ్యం, ముల్కల ప్రభాకర్, కుంభాల రాజన్న పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం రాజకుమార్ అన్నారు. శనివారం శివ్వారం గ్రామంలో గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ఆవిడపు గణేష్‌తో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలకు తరలించే ధాన్యం నాణ్యతాప్రమాణాలు కలిగిఉండాలని తెలిపారు. తాలు తప్పా, చెత్తా చెదారం లేకుండా పూర్తిగా ఆరిన ధాన్యం బస్తాలను కొనుగోలు కేంద్రాలకు తరలించడం ద్వార ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటు అవుతుందన్నారు.

రేపు కార్తీక దీపోత్సవం

నవతెలంగాణ-తాండూర్

ఈనెల 11న ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి సంబంధించిన పనులను శనివారం మున్సిపల్ అధ్యక్షురాలు జక్కుల శ్వేత ప్రారంభించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కార్తీకదీపోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, నాయకులు మునిమంద రమేష్, దెబ్బటి రమేష్, భూపెల్లి రాజేశ్వర్, జక్కుల శ్రీధర్, చిట్యాల మధులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పేరిట సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

నవ తెలంగాణ-తాండూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పేరిట సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోవద్దని తాండూరు సీఐ కుమారస్వామి అన్నారు. సర్వే పేరిట ఎవరైనా ఫోన్‌లో కానీ, నేరుగా కానీ మిమ్మల్ని సంప్రదించినప్పుడు ఆధార్ నంబర్ తప్ప ఇతరత్రా ఓటీపీ, బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డు నంబర్, క్రెడిట్ కార్డుల నంబర్లు, వివరాలు తెలపాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా అలాంటి విషయాలు అడుగుతున్నారు అంటే సైబర్ మోసానికి పాల్పడే యత్నం చేస్తున్నారని గుర్తించి జాగ్రత్త పడాలని సూచించారు. అలా ఎవరైనా ఇంటికి వస్తే వెంటనే 100కి డయల్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాల విషయంలో తప్పనిసరిగా గోప్యత పాటించాలన్నారు.

సెరీకల్చర్‌తో రైతులకు మేలు

నవతెలంగాణ-జన్నారం

సెరీకల్చర్‌తో రైతులకు మేలు జరుగుతుందని పట్టు పరిశ్రమ శాఖ అధికారి రాఘవేందర్ అన్నారు. శనివారం మండలంలోని దేవునిగూడెంతో సహా చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న రైతులకు పట్టుపురుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని, పట్టు పురుగుల పెంపకం ఒకటన్నారు. రైతులు పట్టుపురుగులను పెంచేందుకు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం పట్టుపురుగుల పెంపకానికి అధిక ప్రాధాన్య ఇస్తుందన్నారు. పట్టుపురుగులు పెంచే రైతులకు సబ్సిడీ రూపంలో అనేక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రైతులు ముందుకు వచ్చి పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధనే ధ్యేయం

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో రెండు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా వేధిస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని సాధించడమే తన ధ్యేయమని సీపీఎస్ ఉపాధ్యాయ, అధ్యాపక ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు స్పష్టం చేశారు. సీపీఎస్ రద్దుకు మార్చ్ 2025లో జరగనున్న ఆదిలాబాద్ కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఉపాధ్యాయ శాసనమండలి బరిలో తాను నిలవబోతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని కవ్వాల్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ విధానమనేది ఉద్యోగుల భవిష్యత్తును అంధకారం చేస్తుందని, ఈ విధానం రద్దు చేయడానికి అందరం కలిసికట్టుగా పోరాడుదామన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు రమేష్ చందర్, కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాణ్యమైన పరికరాలు వాడాలి

నవతెలంగాణ-రెబ్బెన



పొలాల వద్ద రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా నాణ్యమైన మోటర్లు, స్టాటర్లు, ఫ్యూజులు, ఇతర సామాగ్రి నాణ్యమైనవిగా వాడాలని ఎంపీడీసీఎల్ ఎస్ఈ ఆర్ శేషారావు, డీఈ జీవరత్నం అన్నారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నంబాల, నారాయణపూర్, కొమురవెల్లి, రాజారం గ్రామాలలో రైతులతో మాట్లాడారు. మోటర్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. దీంతో విద్యుత్ ఆధావుతుందని, మోటోరుకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని పేర్కొన్నారు, వారి వెంట రెబ్బెన ఏఈ ఇమ్రాన్, లైన్ ఇన్స్‌పెక్టర్ సురేష్, స్టాప్ సతీష్ ఉన్నారు.

ఉర్దూ భాషను పరిరక్షించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రాంతీయ భాషపైనే ప్రాంతం, జాతి మనుగడ ఆధారపడి ఉంటాయని, ఉర్దూ బాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీనియర్ ఉర్దూ ఉపాధ్యాయుడు అబుమజర్ రజా అన్నారు. శనివారం ప్రముఖ ఉర్దు కవి అల్లామా మహ్మద్ ఇక్బాల్ జన్మదినాన్ని పురస్కరించుని నిర్వహించే ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని తెలంగాణ మైనార్టీస్ ప్రయివేటు రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని టీఎన్జీఓ సంఘ భవనంలో జరుపుకున్నారు. ఉర్దూ భాషా నేపథ్యం, ప్రాముఖ్యం, సరంక్షించుకోవాల్సిన అవసరాన్ని, ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. కాగా ఈ సందర్భంగా ఉర్దూ రంగంలో రాణిస్తున్న పలువురిని సత్కరించారు. ఇంగ్లీష్ మీడియం మోజులో మాతృభాష ఉర్దుకు ప్రాధాన్యత తగ్గుతోందన్నారు. ఉర్దూ భాషను పరిరక్షించి భావి తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. ఉర్దును సెకండ్ లాంగ్వేజ్‌గా గుర్తించినప్పటికి ఆ మేరకు ప్రాధాన్యత దక్కడం లేదని వాపోయారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ అమీరొద్దీన్, ఫైసల్బిన్ వహాబ్, తన్వీర్ పరేఖ్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం గ్యారంటీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దన్నగా అండగా నిలుస్తుందని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నాయకులతో కలిసి బాబాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన బానోత్ శిరీషకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రస్తుతం సంక్షేమ పథకాలకు సంబంధించిన డబ్బులు త్వరితగతిన వస్తున్నట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు నాణ్యమైన వైద్యం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మసాదే చరణ్, ఆసిఫాబాద్ మాజీ ఎంపీపీ బొమ్మన బాలేష్ గౌడ్, నాయకులు చునర్కర్ వసంత్ రావు, చునర్కర్ దీపక్ పాల్గొన్నారు.

పైపులు దొంగిలించిన ఇద్దరిపై కేసు

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని గోయగాంలో పైపులు దొంగిలించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. గోయాగాం గ్రామానికి చెందిన నాగోస్ సత్తయ్య పత్తి చెనులో గత నెల 12న పైలులు దొంగిలించబడ్డాయి. సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పైపులు దొంగిలించిన కెరమెరికి చెందిన గణపతి, వాంకిడి మండలానికి చెందిన వడై సుందరంలను గుర్తించారు. వారిని అరెస్టు చేసి సిర్పూర్ కోర్టులో ప్రవేశపెట్టగా సిర్పూర్ మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వయోవృద్ధుల సంరక్షణను బాధ్యతగా భావించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వయోవృద్ధుల సంరక్షణను భారంగా కాకుండా, బాధ్యతగా భావించాలని జిల్లా సంక్షేమాధికారిణి సబిత అన్నారు. అక్టోబర్ 1న నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి హాజరు కాలేని, స్థితిలో ఉన్న వృద్ధులను శనివారం వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో వారి ఇండ్ల వద్దకే వెళ్లి సత్కరించారు. ఇందులో భాగంగా రాణిసతీజీ కాలనీలోని 90 యేండ్లు పైబడిన వృద్ధురాలు నాలం గంగుబాయిని సత్కరించారు. 90 యేండ్లు పై బడిన వయస్సులోనూ ఆరోగ్యం, చలాకిగా ఉండటం ఆ తరానికి సాధ్యపడిందని అన్నారు. వయో భారం కారణంగా కార్యక్రమానికి హాజరు కాలేని వారిని ఇళ్ల వద్ద సత్కరించడం అనందంగా ఉందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటే బ్రతికినంతకాలం అనందంగా జీవించవచ్చున్నారు. వయోవృద్ధుల శేష జీవితం ఆనందంగా సాగేలా చూడాల్సిన బాధ్యత వారి పిల్లలు, వారసులపై ఉందని వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. మంచి సంరక్షణ కారణంగా వారంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పోశెట్టి, వయోవృద్ధుల సమాఖ్య సభ్యులు గుండా వామన్‌రావ్, నీల కిషన్, కిషోర్, మోహన్, ప్రకాష్, భాస్కర్ పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



నవతెలంగాణ-ఖానాపూర్

అమరవీరుల స్ఫూర్తితో కార్మిక, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. శనివారం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి భారత విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరుల జీవితాలు మనకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి 77 ఏండ్లు గడుస్తున్న ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, కుల, మత వైషమ్యాలు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల నరేంద్ర మోడీ పరిపాలనలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు హరించివేయబడ్డాయని అన్నారు. ఎన్నికల్లో ఉపాధి భద్రత, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, హామీలు అటుకెక్కాయని అన్నారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, రాములు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి, గుజ్జుల గజ్జన్న, గూట్ల ప్రసాద్, ఆకుల సత్తన్న, డివిజన్ నాయకులు మాన్యా శ్రీనివాస్, రేకుల గంగన్న, బక్కతట్ల మల్లేష్ పాల్గొన్నారు.

నేడు ఖోఖో అండర్-17 బాలుర ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విజయ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి ఏ.రవీందర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా వివరాలకు విజయ హై స్కూల్ పీఈటీ గిరిప్రసాద్‌ని సంప్రదించాలని తెలిపారు.

నేడు ఎస్టీ హోదాపై మాలీల సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అలస్యాన్ని గురించి చర్చించడానికి జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల పూలే గెస్ట్ హౌస్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్టు అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులందరూ సకాలంలో హాజరై భవిష్యత్ కార్యాచరణపై చర్చించాల్సి ఉందని పేర్కొన్నారు. సభ్యులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎర్రజెండా పార్టీలన్నీ ఏకం కాబోతున్నాయి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-మంచిర్యాల

దేశంలో బీజేపీ నియంతృత్వ విధానాలను అవలంభిస్తోందని, 420 వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిలుపుకోలేకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రజల కోసం ఎర్రజెండా పార్టీలన్నీ ఏకం కాబోతున్నాయన్నారని తెలిపారు. శనివారం మందమర్రిలో జరుగుతున్న సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలకు హాజరైన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమ్యూనిస్టుల పని అయిపోయిందని, కమ్యూనిస్టులు లేరని భావించిన ప్రపంచం మొత్తం ఇప్పుడు ఒక్కసారిగా కమ్యూనిస్టుల ఉద్యమాల కోసం ఎదురు చూస్తోందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ఒకే దేశం ఒకే ఎన్నిక అని వ్యాఖ్యలు చేస్తున్నారని, పలుమార్లు ఎన్నికలతో ఆర్థిక సంక్షోభం వాటిల్లుతుందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధికంగా ఉన్న బీసీలకు ఎటువంటి అవకాశాలు లేకుండా పోతున్నాయని, బీసీలకు న్యాయం జరిగేలా సవరణ చట్టాలు తేవాలని తెలిపారు. కుల గణనకు మోడీ వ్యతిరేకి అని, బీజేపీ మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూనే ఉంటుందని తెలిపారు. సింగరేణిలో కార్మికులు తగ్గిపోతున్నారని, బొగ్గు బావులు కూడా తగ్గిపోతున్నాయని తెలిపారు. మొత్తంగా బీజేపీ సింగరేణిని ప్రయివేటీకరించే కుట్ర చేస్తోందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ చిత్త శుద్ధి చూపడం లేదన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే వచ్చి ఏడాది కూడా కాలేదు..ఇంకా 4సంవత్సరాలు ఉందిగా ఆలోపు అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రులు, సీఎం అనడం హాస్యాస్పందంగా ఉందని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని సంబరపడుతున్నారు కానీ సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని తెలిపారు. రైతుబంధు జాడే లేదని, రైతులు, కూలీలు, దళితులు, కార్మికుల అభివృద్ధి, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500 ఇస్తామన్న వాటి ఊసే తీయడం లేదని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో ఆక్రమణలు తొలగిస్తామని చెప్పి ఒకటో రెండో మాత్రమే సంపన్నుల భవనాలు కూల్చి మిగిలిన పేదోళ్ల ఇండ్లను కూల్చేస్తున్నారని తెలిపారు. నష్టపోయిన వారికి డబులు బెడ్‌రూమ్‌లు ఇస్తామని చెప్పి అమాయక ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ వేరు, ప్రక్షాళన వేరని, నల్గొండ, భువనగిరి జిల్లాల్లోని ఫార్మా, మందులు, ఇతర ఫ్యాక్టరీల నుండి వెలువడే వ్యర్థాలు మూసీలో కలవడంతో నది కలుషితంగా మారుతోందని తెలిపారు. వాటిని ఆపేస్తే మూసీని కాపాడినట్టే అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాసౌమ్యం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాసామ్యాన్ని పునరుద్ధరిస్తామని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ప్రజలను, ప్రతి పక్షాలను సంప్రదించకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటూ ప్రజాసామ్యాన్ని కూనీ చేస్తున్నాడని మండిపడ్డారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయనిపక్షంలో పార్టీ తరపున ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల్లో ఎండగడతామని, ప్రజల కోసం ఎర్ర జెండాలు ఏకమై చేసే ఉద్యమాలకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జి.రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య భూపాల్, జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా నాయకులు బోడంకి చందు, గోమాస ప్రకాష్, కొండగొర్ల లింగన్న, గోమాస అశోక్, దుంపల రంజిత్ కుమార్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



తీర్థయాత్రల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు

- రీజనల్ మేనేజర్ సాలోమాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పుణ్యక్షేత్రాల దర్శనం, తీర్థయాత్రల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని ఆర్ఎం సోలోమన్ అన్నారు. తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ముందస్తుగా బుక్ చేసుకున్న ప్రయాణికులతో శనివారం ప్రత్యేక బస్సు బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరింది. కాగా ఆర్ఎం సోలోమన్, డిప్యూటి ఆర్ఎం ప్రవీణ్, ఆర్ఎంఓ ప్రణీత్, డీఎం కల్పనతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రయివేటు ట్రావెల్స్ తరహాలో ఆర్టీసీ సైతం పుణ్యక్షేత్రాల దర్శనం కోసం స్పెషల్ ప్యాకేజీలతో బస్ సౌకర్యాన్ని కల్పిస్తోందని తెలిపారు. ముందస్తు బుకింగ్‌లకు అవకాశం కల్పించడంతో సరిపడా ప్రయాణికులతో స్పెషల్ బస్సు అరుణాచలం బయలు దేరినట్లు తెలిపారు. వెళ్లే మార్గంలోని వెల్లూరు, కాణిపాకం వంటి క్షేత్రాలను దర్శించుకుని, అరుణాచలం చేసుకుని గిరి ప్రదక్షిణ చేస్తారన్నారు. 12న వీరు తిరిగి ఆదిలాబాద్‌కు వస్తారన్నారు. పెద్దవారికి రూ.5వేలు, పిల్లలకు రూ.3వేల 200 టిక్కెట్ ఉంటుందన్నారు. శభరిమలై క్షేత్ర దర్శానానికి కూడా ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయనున్నామని, ఆర్టీసీ కల్పిస్తున్న అవకాశాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ శ్రీకర్, రాజేందర్, ఎస్ఎం శ్రీనివాస్, రిజర్వేషన్ కౌంటర్ ఇన్‌చార్జీ ఎస్ఏ హుస్సేన్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నవంబర్ 08, 09 తేదీన అన్ని పోలింగ్ బూత్‌లలో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరుగా నమోదు, పేరు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే తమ అభ్యంతరాలను అధికారులకు ఆధారాలతో తెలుపవచ్చునన్నారు. 01 జనవరి 2025 నాటికి 18 ఏండ్లు నిండబోవు యువతీ, యువకులు ఫారం నెంబర్ 6తో ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చునన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేయుటకు ఫారం-6, ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఫారం-7, జాబితాలో మీ చిరునామా, సవరణలు చేయుటకు ఫారం-8 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అంతకుముందు పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులకు, ఉపాధ్యాయులను ఆదేశించారు. తాగునీరు అందించాలని, మరుగుదొడ్లకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రత్న కళ్యాణి, బూత్ స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య దేశాల్లో అతిపెద్ద పార్టీగా బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాస్వామ్య దేశాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ పంక్షన్ హాలులో బీజేపీ సంస్థాగత ఎన్నికలపై వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. పార్టీ సాధారణ, క్రియాశీల సభ్యత్వాలు, సంస్థాగత బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలు వంటి పలు అంశాలపై నాయకులు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సంస్థాగత ఎన్నికల కార్యశాల ఇన్‌చార్జీ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, రైల్వే బోర్డు సభ్యుడు జీవి.రమణ, ఆధినాథ్, వేణుగోపాల్, సుహాసినిరెడ్డి, లాలా మున్నా, మయూర్ చంద్ర, బోయర్ విజయ్, ఎన్రాల నగేష్ పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉండం గ్రామానికి చెందిన కల్లూరి సులోచన ఇల్లు శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఎలుకలు కరెంటు తీగలను కట్ చేయడంతో శుక్రవారం అర్ధరాత్రి కరెంటు తీగలు ఒకదానికొకటి తగలడంతో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్క ఇండ్లవారు అదే రోజు రాత్రి మంటలు ఆర్పి వేసినప్పటికీ ఇంట్లో ఉన్న వస్తువులతో పాటు రూ.3వేల నగదు, బీరువాలో ఉన్న విలువైన పత్రాలు, మంచాలు, బట్టలు, పూర్తిగా కాలిబుడిదయ్యాయి. బాధితురాలు కల్లూరి సులోచన తమను ఆదుకోవాలని అధికారులను కోరారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. జరిగిన సంఘటనపై జిల్లా అధికారులకు విన్నవిస్తానని బాధితులకు తెలిపారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే...

మండలంలోని ఉండం గ్రామానికి చెందిన కల్లూరి సులోచన చంద్రశేఖర్ ఇల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ ప్రమాదంలో కాలి పోవడంతో శనివారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంటిని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. వీరి వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని సాయి కుంటలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు విశిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నాణ్యమైన విద్య అందించడంతోపాటు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమన్వయంతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు చేపట్టి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఇథనాల్ పరిశ్రమకు మద్దతు ఇస్తున్నారని ఆరోపిస్తూ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయడాన్ని ప్రజా సంఘాలు తప్పు పట్టాయి. ప్రజాసమస్యలపై స్పందించడమే నేరమా అని ప్రశ్నించారు. ఇథనాల్ పరిశ్రమను దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాడుతుంటే, ప్రజాభిప్రాయాన్ని గౌరవించని ప్రభుత్వం కాలుష్య కోరల్లోకి ప్రజలను ముంచాలని చూస్తూ ఎవరి కోసం పనిచేస్తున్నారని ప్రశ్నించారు. ఆంధ్ర కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న ఎంఎల్‌ఏ, ఎంపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని, తక్షణమే విజయ్ కుమార్ సస్పెండ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ పరిశ్రమను తరలించేవరకు ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నట్లుగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిత, భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాజేష్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

సోమవారం ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నేటి నుండి నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే - సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేశామని పేర్కొన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు.

సమగ్ర కుల గణన సర్వేకు సహకరించాలి

నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేను ప్రజలంతా సహకరించాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు కొందమడుగు గణేష్ అన్నారు. శనివారం మండలంలో సోనాల గ్రామంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని కుల గణన సర్వే భారత రాజ్యాంగ మూల సిద్ధాంతంపై ఆధారపడిందన్నారు. ప్రభుత్వం సర్వే నివేదిక త్వరగా తెప్పించి రాష్ట్రంలో రాజకీయ ఆర్థిక సంపదలు సామాజిక న్యాయాన్ని 90 శాతం అనగారిన కులాలందరికీ సమానంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

